# “దేవుని క్రియలు ప్రత్యక్షపరచబడుటకే” (9:1-5)

జీవితమనేది కేవలం ఒక పెద్ద ఆకస్మిక సంభవమా, ఆకస్మిక సంభవపు పెద్ద ఆటయా? మన జీవితంలో సంఘటనలు యిలా ఎందుకు సంభవిస్తాయో అనే ప్రశ్న మాటి మాటికి తల ఎత్తుతుంది. పూర్వ సాహిత్యంలోను, నిజ జీవితంలోను ప్రత్యేకించి, ఆపదలలోను నష్టంలోను ప్రజలు యిలాటి పరిస్థితిని ఎదుర్కొనడం కద్దు. 9:1-5 అనే మన లేఖన భాగంలో “ఎందుకు?” అనే ప్రశ్నకు ప్రభువు జవాబిస్తున్నాడు.

## ప్రశ్న (9:1, 2)

ఒకనాడు ప్రభువైన యేసు దేవాలయ పరిసరంలో తన శిష్యులతో కూడ నడుస్తూ ఉన్నప్పుడు, పుట్టుకతో గుడ్డివానిని దాటి వెళ్లే పరిస్థితి తటస్థించింది (9:1). అతడు సాధారణ భిక్షగాడై ఉండినట్టయితే, అతని బట్టలు చినిగిపోయినవిగాను, అతడు మురికిగాను ఉండి, ఏ విధమైన నిరీక్షణ లేనివాడై ఉంటాడు. వారు యెరూషలేములో ఉన్న అనుదినం యేసును ఆయన శిష్యులును భిక్షగాండ్రను చూస్తూనే ఉంటారు. అయితే ఏదో ఒక కారణాన్ని బట్టి, పుట్టుకతోనే అతడు గుడ్డివాడవడంవల్ల ఆ దినాన ఆయన శిష్యులు ఒక ప్రశ్న అడిగారు.

ఆ భిక్షగాడు ఎందుకు గుడ్డివాడైయున్నాడో - దాని విషయంలో ప్రభువు భావన ఏమో తెలిసికోవాలని వారు కోరారు (9:2). అతని పాపాన్ని బట్టియా లేక అతని తల్లిదండ్రుల పాపాన్ని బట్టియా? అనేది వారి ప్రశ్న. వారి మనస్సుల్లో, బాధ అనేది ఎల్లప్పుడు పాపంవలననే కలుగుతుంది. అందునుబట్టి, ఎవరో ఒకరి పాపము ఆ గుడ్డివానికి కారణమైయుండి తీరాలి. అయితే అది ఆ మనుష్యుని పాపమా? అలాగైయున్నట్టయితే, అతడు గుడ్డివానిగా ఎందుకు పుట్టాలి? లేదు. జన్మించిన శిశువు గుడ్డివాడు అయ్యేంతగా దోషి కాలేదు. అప్పుడు, పాపం చేసినవారు అతని తల్లిదండ్రులై ఉంటారా? అయ్యుండవచ్చు, కాని అది అతని తల్లిదండ్రుల పాపమే అయ్యుంటే, అప్పుడు వారి కుమారుడు ఎందుకు బాధపడాలి?

పాపము బాధను కలిగిస్తుందనే విశ్వాసం మీద ఆయన శిష్యుల ప్రశ్న నాటుకొని యుంది. కారణ కార్య బాంధవ్యం పాపము, బాధ అనేవాటి మధ్య ఉన్నట్టు దాని భావమై ఉంది. గత కాలంలో ఈలాటి భావన సహజమైయుంది. యోబు తన పిల్లలను, ఆస్తిని, ఆరోగ్యాన్ని కోల్పోయిన తరువాత, అతనిని ఆదరింప వచ్చిన స్నేహితులలో ఒకడు యోబుతో యిలా అన్నాడు,

జ్ఞాపకము చేసికొనుము, నిరపరాధియైన యొకడు ఎప్పుడైన నశించెనా?
యథార్థవర్తనులు ఎక్కడనైన నిర్మూలమైరా?
నేను చూచినంతవరకు అక్రమమును దున్ని
కీడును విత్తువారు దానినే కోయుదురు.
దేవుడు ఊదగా వారు నశించుదురు
ఆయన కోపాగ్ని శ్వాసమువలన వారు లేక పోవుదురు.
సింహగర్జనయు క్రూరసింహపు శబ్దమును నిలిచిపోవును.
కొదమ సింహముల కోరలును విరిగిపోవును.
ఎర లేనందున ఆడుసింహము నశించును
సింహపు పిల్లలు చెల్లా చెదరగొట్టబడును
(యోబు 4:7-11).

"పిలాతు గలిలయులైన కొందరి రక్తము వారి బలులతో కలిపి"యున్న సందర్భంలో కూడా బాధకు యిలాటి భావమే వ్యక్తపరచబడింది (లూకా 13:1). ఆ గలిలయులు అలా సంహరింపబడడాన్ని గూర్చి యేసు ఏమనుకుంటున్నాడో వారు వినగోరారు. ప్రశ్నించినవారి ఉద్దేశాలు ఏమైయున్నా, పాపానికి బాధకు కార్యకారణ సంబంధం ఎల్లవేళలా ఉండనవసరం లేదనే విషయాన్ని బోధించడానికి ఆయన ఈ ప్రశ్నలను అవకాశంగా తీసికొన్నాడు. ప్రత్యేకింపబడిన బాధ ప్రత్యేకింపబడిన పాపమందు ఎల్లవేళలా తన వ్రేళ్లను పాతుకుని ఉండదు. దీనిని పురస్కరించుకొని, సిలోయములోని గోపురము కూలి చనిపోయిన పదునెనిమిది మందిని గూర్చియు ఆయన ప్రస్తావించాడు. వారి మరణానికి వారి పాపము కారణమా? ప్రభువైన యేసు తన ప్రశ్నకు తానే జవాబు చెప్పాడు: "కారని మీతో చెప్పుచున్నాను; మీరు మారుమనస్సు పొందనియెడల మీరందరును ఆలాగే నశింతురు" (లూకా 13:5).

ఈ ప్రశ్నను సంవత్సరాల తరబడి యూదా మత సంబంధమైన రబ్బీలు చర్చించుచూ వచ్చారు. "పాపం లేకుండా మరణం లేదు, మరియు అక్రమం లేకుండ బాధ లేదు" అని అమ్మి అనే రబ్బీ అన్నాడు.[1] వాస్తవంగా, బాధ అనేదాన్ని పాపంతో వివరింప వచ్చునని అతడు కూడా నమ్మాడు.

మొదట్లో ఈ భావన నేడు మనకు వింతగాను పరాయిగాను గోచరించవచ్చు. అయితే దాన్ని పరిశీలించినప్పుడు, మనం గుర్తించిన దానికంటె మన నమ్మిక ఆ శిష్యుల నమ్మికకు సమీపంగా ఉన్నట్టు మనం కనుగొంటాం. మరణాంతకమైన వ్యాధులతో గాని, విపత్కరమగు ఆకస్మిక సంభవాలవలన గాని తమ పిల్లలను పోగొట్టుకున్న తల్లిదండ్రులను నేను ఎరుగుదును, తాత్కాలికపు దిగ్భ్రమనుండి వారు తేరుకున్న తరువాత, తమ పిల్లలకు ఆలాటి ఆపదలు కలగడానికి కారణమేమై ఉంటుందో కనుగొనడానికి దీర్ఘకాలం వారు ఆలోచనలో పడి ఉంటారు. ఒకవేళ అది వారి యౌవనకాలపు పాపమేమో అని కొందరు తలంచుతారు. వారు కారణాన్ని గుర్తించకపోయినా, ఒకవేళ అది వారు చేసిన భయంకరమైన పాప ఫలితమేమో అని భావించేవారున్నారు. విషాదకరంగా, కొందరు తల్లిదండ్రులు ఆ పరిస్థితులలో సంవత్సరాల తరబడి తమ్మును తాము మానసికంగా చిత్రహింసలకు గురి చేసికొనేవారున్నారు. గుడ్డివానిగా పుట్టినవానిని గూర్చిన ఆ శిష్యుల

ప్రశ్న మనలో ఎవనికిని క్రొత్తది కాకపోవచ్చు!

వినాశకరమైన సంభవాలను మనం ఎదుర్కోనప్పుడు కూడా, పాపము – బాధలనే వాటికి కార్య కారణ సంబంధమున్నట్టు మన భాష మనలను మోసగిస్తూ ఉంటుంది. కష్టాలుగాని, బాధలుగాని మనం ఎదుర్కొన్నప్పుడు, "దీనికి నేను పాత్రుడనై ఉండడానికి నేను చేసింది ఏమి?" అని మనం కొన్నిసార్లు ప్రశ్నించుకోము. మనకు దుఃఖకరమైనది ఏదేని సంభవించినప్పుడు "ఇది న్యాయం కాదు!" అని మనం కేకవేసే ప్రతిసారి అదే ఆలోచన మనయందు సూచింపబడుతుంది. ఈ జీవితంలో ప్రతిదీ న్యాయంగా జరగాలని మనం ఎదురు చూస్తామా? ఎల్లప్పుడు సుఖము సత్ప్రవర్తన యొక్క ఫలితమని బాధ ఎల్లప్పుడు పాపము యొక్క పర్యవసానమని మనం నమ్ముతామా?

ఎప్పుడో ఒకప్పుడు మనమందరం శిష్యుల యొక్క ప్రశ్నను అడుగుతాం. బాధను మనం ఎదుర్కొనినప్పుడు, అది మనదేగాని లేక యితరులదే గాని, అది ఎందుకు సంభవిస్తుందో మనం తెలిసికొనగోరతాం. "ఎందుకు?" అనే ప్రశ్నకు లేఖనాల్లో సంపూర్ణమైన జవాబు యివ్వబడలేదు. యోబు దానిని అడిగాడు. మానవ జీవిగా దానిని గ్రహించడానికి అది నీ సామర్థ్యానికి మించినదని దేవుడు అతనికి బదులిచ్చాడు (యోబు 40; 41). "వినికిడిచేత నిన్ను గూర్చిన వార్త నేను వింటిని అయితే ఇప్పుడు నేను కన్నులారా నిన్ను చూచుచున్నాను. కావున నన్ను నేను అసహ్యించుకొని, ధూళిలోను బూడిదెలోను పడి పశ్చాత్తాపపడుచున్నాను" (యోబు 42:5, 6). హబక్కూకు అడిగాడు, కాని ఎన్నడూ జవాబు యివ్వబడలేదు. తనకు సంపూర్ణంగా గ్రహింపు కలుగకపోయినా, చివరకు అతడు దేవునియందు పూర్ణమైన నమ్మికయుంచ తీర్మానించుకున్నాడు:

> అంజూరపు చెట్లు పూయకుండినను
> ద్రాక్షాచెట్లు ఫలింపకపోయినను
> ఒలీవచెట్లు కాపులేకయుండినను
> చేనిలోని పైరు పంటకు రాకపోయినను
> గొఱ్ఱెలు దొడ్డిలో లేకపోయినను
> సాలలో పశువులు లేకపోయినను
> నేను యెహోవాయందు ఆనందించెదను
> నా రక్షణకర్తయైన నా దేవునియందు
> నేను సంతోషించెదను
> ప్రభువగు యెహోవాయే నాకు బలము
> ఆయన నా కాళ్లను లేడి కాళ్లవలె చేయును
> ఉన్నత స్థలములమీద ఆయన నన్ను నడువచేయును
> (హబక్కూకు 3:17-19).

"ఎందుకు?" అనే ప్రశ్నకు సంపూర్ణమైన సమాధానాన్ని లేక జవాబును ఈ ప్రజలు పొందలేదు సరిగదా, యోహాను 9లో యేసు యొక్క శిష్యులు కూడా పొందలేదు!

## జవాబు (9:3)

ఆ భిక్షగాడు గుడ్డివాడుగా ఎందుకు పుట్టాడో ప్రభువు ప్రశ్నించబడినప్పుడు, ఆయన యిచ్చిన జవాబు యిదే: "–వీడైనను వీని కన్నవారైనను పాపము చేయలేదు గాని, దేవుని క్రియలు వీనియందు ప్రత్యక్షపరచబడుటకే వీడు గ్రుడ్డివాడుగా పుట్టెను" (9:3). మానవ బాధకు హేతువేమని ప్రభువు ప్రశ్నింపబడ్డాడు. ఆ ప్రత్యేకమైన ప్రశ్నకు బదులివ్వడానికి ఆయన నిరాకరించాడు. ఆ అంశం దేవుడు ఏమి చెప్పనైయున్నాడో దానిని మనం సంపూర్తిగా గ్రహించే సామర్థ్యం లేనందువలన ఆయన దానిని అలా దాటియుండవచ్చు. కారణమేమైయున్నా, మానవ బాధలో ఉన్న ఉద్దేశమేమై ఉందో దానిని ఆయన చెప్పగోరాడు. ఆ మనుష్యుడు గుడ్డివాడుగా ఎందుకు జన్మించాడో చెప్పకపోయినా, ఆ మనిషి జీవితం వెనుకనున్న ఉద్దేశమేమైయుందో ఆయన దానిని యిలా తెలియజేశాడు: "దేవుని క్రియలు వీనియందు ప్రత్యక్షపరచబడుటకే వీడు గ్రుడ్డివాడుగా పుట్టెను."

మన జీవిత ప్రాధాన్యతలు మనం నిలుపుకునే విధానానికి విరోధంగా ఈ విషయంలో ప్రభువైన యేసు మాటలు మోదుకొంటున్నాయి. "జీవితానికి, స్వాతంత్ర్యానికి, సంతోషాన్ని వెదకడానికి నీకు హక్కుందని" అమెరికావారికి వారి రాజ్యాంగ చట్టం చెప్తుతుంది. వ్యక్తిగతమైన సంతోష సాధనమే జీవిత గమ్యమైయున్నట్టు యిది తరచుగా అపార్థం చేయబడింది. మనం అలాటి దృష్టిని లేక ఉద్దేశాన్ని గైకొనినప్పుడు, బాధ అంతా మన ఆనందానికి అంతరాయం కలిగించినట్టును, అందునుబట్టి అది భయంకరమైనదైనట్టు మనం భావిస్తాం. అయితే, జీవితం యొక్క ఉద్దేశం "దేవుని క్రియలు ప్రత్యక్షపరచబడడమే" అయ్యుంటే, మన దీవెనలు ఎలా దేవుని మహిమపరచే మార్గాలుగా మనం చూస్తామో, అలాగే మన బాధలను సహితం మనం చూస్తాం. శిష్యులకు ప్రభువైన యేసు ఇచ్చిన సందేశమదే. గుడ్డివాడు ఎందుకు గుడ్డివాడుగా పుట్టాడో ఆయన తెలుపకపోయినా, ఆ గుడ్డివాని జీవిత ఉద్దేశమేమో ఆయన తెలిపాడు; అది దేవుని మహిమపరచడానికే!

తమ బాధలో "దేవుని కార్యాలను ప్రచురపరచినవారిని" గూర్చి నేను ఆలోచించి నప్పుడు, పలువురు జ్ఞాపకానికి వస్తారు. పరిమితిగల మానసిక సామర్థ్యం ఉన్న యువకుడు వీరిలో ఒకడు. వారి కుమారుడు అలా ఎందుకు జన్మించాడో వాని తల్లిదండ్రులు దేవుని ఒక కోటి సార్లు అడిగియుండవచ్చునని నేను తలంచుతాను. ఒక ప్రసంగం యొక్క ముగింపులోని ఆహ్వానానికి అంగీకారంగా, అతడు బాప్తిస్మం పొందిన రాత్రిని నేను ఎప్పుడు జ్ఞాపకం చేసికొంటాను. రమ్యమైన సరళతతో, "దేవుడు నన్ను ఏమి చేయుమని కోరాడో కేవలం నేను దానినే చేస్తాను" అని అతడంటూ, ప్రభువైన యేసునందు తన విశ్వాసాన్ని ఒప్పుకున్న దినాన ఆ కూడిక అంతటిలో కంటతడి పెట్టనివారు లేరనే చెప్పాలి. ఆ సమయంలో ఆ యువకుని జీవితంలో దేవుని క్రియలు ప్రత్యక్షపరచబడ్డాయి.

మరణకరమైన వ్యాధి తనకు కలిగియున్నట్టు వెంటనే తెలిసిన ఒక సువార్తికుని తలంచుతూ ఉంటాను. తాను బాగుపడాలని దేవునికి ప్రార్థిస్తాడట, అతడు బాగుపడి నట్టయితే; తాను ఎలా చనిపోతాడో సంఘానికి కనుపరచేలా అతడు దేవునికి ప్రార్థిస్తాడట.

ఇలా అతడు సంఘానికి తెలిపాడు. కొన్ని నెలల తరువాత అతడలాగే చేశాడు; అతని మరణంలో దేవుని క్రియ ప్రదర్శింపబడింది!

తన శ్రమలో దేవుని క్రియను ప్రదర్శించిన మరొక ఉదాహరణ: కొన్ని సంవత్సరాలుగా క్యాన్సర్‌తో సతమతమైన ఒక క్రైస్తవ స్త్రీ యిటీవల ప్రభువుతో ఉండవెళ్లింది. "ఎందుకు?" అని ప్రజలు అనడం నేను అనేకసార్లు విన్నాను. అనేక సంవత్సరాలుగా ఆమె జబ్బుపడిన పరిస్థితిని వెనుకకు చూచినప్పుడు, అనేక మంది తమ మంచి ఆరోగ్యంలో ఎన్నడూ చేయలేని విధంగా ఆమె తన రోగమందు దేవుని క్రియను కనుపరచింది.

సిలువపై శ్రమనొందిన క్రీస్తే ఉద్దేశ పూర్వకమైన జీవితానికి కట్టకడపటి ఉదాహరణ అది అన్యాయం, అది క్రూరత్వం. అది అనేక విధాలుగా, ఒక విషాద గాథ. అయినా, తన జీవితమందును మరణంలోను "దేవుని క్రియలు ప్రత్యక్షపరచబడడానికి" గాను యేసు సిలువలో వ్రేలాడాడు. క్రీస్తు సిలువలో ఎందుకు బాధింపబడాలో నేను కలిసికొన్న ఎవరును నాకు ఎన్నడును వివరించలేదు. పరలోకం చేరేవరకు మనం దాన్ని పరిపూర్ణంగా గ్రహించగలమని నేను నమ్మను. ఏదియెలాగున్నా, ఒక చిన్న బిడ్డ సహితము, యేసు సిలువకు వెళ్లినందున, దేవుని క్రియ అద్భుతంగా ప్రత్యక్షపరచబడిందన్న వాస్తవాన్ని అభినందించగలడు. ఆయన దేవుని ఉద్దేశం కొరకు జీవించాడు, చనిపోయాడు.

దేవుడు తన వీపును మనవైపుకు త్రిప్పాడని, ఆయన మహిమకొరకు మనం యికను ఎన్నడు ఉపయోగింపబడమనే భావనకు వచ్చేలా ఏదో ఒకదానిని మనమందరం ఎదుర్కొంటాం. కొందరు, "నేను వివాహమందు తంటాలు పడ్డాను"; "నా బిడ్డలతో సమస్యలున్నాయి"; "నేను రోగిని"; లేదా "నేను ముసలివాడను/కుర్రవాడను"; "విడాకులు యివ్వబడినవాడను/దానను" అని చెప్పవచ్చు. ప్రభువైన యేసు మన లోకంలోనికి నడుచుకొంటూ వచ్చి, "నీవు నేడు ఎదుర్కొంటున్న కష్టాలు ఎందుకు ఎదుర్కొంటున్నావన్న విషయం నేను నీతో చెప్పను, నేను యిది మాత్రం చెప్తాను: నీకు సమస్యలున్నా సరే దేవుని క్రియ నీయందు ప్రత్యక్షపరచబడుతుంది – ఒకవేళ నీకు సమస్యలను బట్టియైనా!"

దీనికి ఉదాహరణగా, పౌలు పలుపురెరిగే "శరీరములో ఒక ముల్లు" చేత బాధింపబడినట్టు నిలిచాడు (2 కొరింథీ. 12:7). దాన్ని తొలిగించుమని అతడు ముమ్మారు ప్రభువును వేడుకున్నాడు. తాను ఆ బాధనుండి తొలిగింపబడి ఉన్నట్టయితే అతడు ప్రభువుకొరకు యింకా ఎంత ఎక్కువగా పని చేసియుండేవాడో పౌలు ఊహించి యుంటాడని నా నమ్మకం. దానికి బదులు, దేవుడు అతనికి ఈ సందేశం యిచ్చాడు: "నా కృప నీకు చాలును, బలహీనతయందు నా శక్తి పరిపూర్ణమగుచున్నదని ఆయన నాతో చెప్పెను" (2 కొరింథీ. 12:9). మంచి ఆరోగ్యము బలము ద్వారా కాక, బలహీనత ద్వారా దేవుని శక్తి శ్రేష్ఠంగా ప్రదర్శింపబడినట్టు పౌలు కడకు దేవుని తీర్మానాన్ని అంగీకరించాడు. కష్టాలు లేక బాధలను నిర్వహించడంలో దీనివల్ల పౌలు మనకు ఒక మాదిరిని చూపాడు. మొదట, మన బాధనుండి విడుదల చేయుమని దేవునికి మొర పెట్టడం. బాధపట్ల యిది మానవ సహజమైన వైఖరియై ఉంటుంది. మరియు విడుదలకు మొర పెట్టడం సరియే. అయినా, క్రైస్తవునికి రెండో మెట్టు, "ఏది వచ్చినా సరే, నా జీవితంలో నీవు మహిమ పరచబడాలి" అని అతడు దేవునికి విన్నవించుకోవాలి. మన

పరిస్థితి ఏదైయున్నా, దేవుని క్రియ బయలుపరచడానికి మనమందరం ఉపయోగింప బడవచ్చు!

కేన్సర్‌తో జరిగిన పోరాటం తరువాత నాటకీయంగా బేస్‌బాల్‌కు తిరిగి వచ్చిన డావే డ్రావెక్కీ, సాన్ ఫ్రాన్సికో గాయపడిన తరువాత జయంట్స్ స్టార్ ఆటగాడిగా అతని క్రీడా జీవితం ముగిసింది. అతడు తరువాత యిలా వ్రాశాడు,

> విపత్తును ఏక ద్వారపు మార్గం గుండా నెట్టినప్పుడు, మనం దానిగుండా వెళ్లుతాం, విపత్తుకు ముందున్న జీవితానికి మనమెన్నడు తిరిగి రాలేము. ... మనం అలా చేయాలని ఎంతగా బాధపడినా మనం అక్కడికి తిరిగి రాలేము. మనం చేయగలిగిందంతా, గతంలో మనం ఏమైయున్నామో, దానివలన ఏ మంచి జరిగిందో, మనం అనుభవించిన సంతోషకరమైన కాలాలను బట్టి, ఆనందం కొరకు, ప్రేమకొరకు, పంచుకొన్న జ్ఞాపకాల కొరకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించడమే. అప్పుడు, ఆ కాలాలకు, ఆ ప్రియులైన వారికి వీడ్కోలు పలికి సూర్య చంద్ర నక్షత్రాలకు వాటి వాటి గమనాన్ని నియమించిన వాని చేతిలో మన చెయ్యి వేసి మన జీవితాలకు కూడా గమనముందని నమ్మిక ఉంచడమే.[2]

## ముగింపు

"జీవితానికి అర్థముందా, లేక అది కేవలం ఆకస్మిక సంభవం యొక్క ఆటయేనా?" అనే ప్రశ్న లోకంలో యింకా మిగిలే ఉంది. ఈ ప్రశ్నకు లోకంలో జవాబు లేకపోవచ్చు, కాని యేసును వెంబడించువారికి మాత్రం జవాబుంది. లోకంలో మనకు ఏది సంభవించినా అది దేవుని మహిమకొరకు ఉపయోగింపబడే అవకాశం ఉంది. పరిస్థితులు ఏమైనా సరే, మనయందు "దేవుని క్రియలు బయలుపరచబడునట్టుగా" మనం జీవించుదాం.

---

సూచనలు

[1]Leon Morris, *The Gospel According to John*, The New International Commentary on the New Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1971), 478. [2]Dave Dravecky, *When You Can't Come Back* (Grand Rapids, Mich.: Zondervan, 1992), 159.